సాక్షి
ప్రకాశం
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



రైతులు బాగుపడాలంటే కూటమి గద్దె దిగాలి

కూటమి ప్రభుత్వానికి ఒక్క రోజుకూడా అధికారంలో ఉండే అర్హత లేదని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..



ప్రయాణికులకు అనంత అగచాట్లు

జిల్లా నుంచి 250 బస్సులను అనంతపురంలో జరిగే సీఎం సభ కోసం తరలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మార్కాపురం ఫారెస్ట్ డీడీ బదిలీ

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌ను అమరావతిలోని హెడ్ ఆఫీసుకు బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో శ్రీశైలం సబ్‌డీఎఫ్‌ఓగా పని చేస్తున్న అబ్దుల్ రవూఫ్‌ను నియమించారు.

తర్లుపాడు ఎంపీడీఓ సస్పెన్షన్


చక్రపాణి ప్రసాద్

తర్లుపాడు: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న తర్లుపాడు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని రోజులుగా సెలవుపై ఉన్న ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళపై లైంగిక దాడికి యత్నించినట్లు మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో తర్లుపాడు పోలీసుస్టేషన్‌లో ఎంపీడీఓపై కేసు నమోదైంది. దళిత మహిళ పట్ల ఎంపీడీఓ వ్యవహరించిన తీరుపై గత నెలలో ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడంతోపాటు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ సస్పెన్షన్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాగతించారు.

రేషన్ వాహనాల రద్దుతో ప్రజల ఇబ్బందులు


మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ఒంగోలు టౌన్: గత ప్రభుత్వం రేషన్ వాహనాల ద్వారా నిత్యావసరాలను సరఫరా చేసిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దు చేశారని, దానివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి చెప్పారు. మంగళవారం ఎల్బీజీ భవనంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డీ షర్మిల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంకణాల రమాదేవి మాట్లాడుతూ ప్రజలు తినగలిగే బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలని, అప్పుడే రేషన్ సరఫరాలో అక్రమాలను అరికట్టే అవకాశం ఉంటుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటిన తరుణంలో రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసరాలను తక్కువ ధరలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 6 నెలలుగా కేవలం బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారని, కందిపప్పు, నూనెల ఊసే లేదన్నారు. అడ్డుఅదుపు లేకుండా పోతున్న నిత్యావసర వస్తువుల ధరల వల్ల సామాన్యులు అప్పుల పాలవుతున్నారన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా నగర నాయకులు జి.ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, కె.లక్ష్మీ ప్రసన్న, కె.రాజేశ్వరి, ఎస్‌కే షమీల, ఏ.విశ్రాంత, డి.నారాయణమ్మ పాల్గొన్నారు.


కనిగిరి: ర్యాలీలో బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, దద్దాల నారాయాణ, బన్నీ, తిరుపతిరెడ్డి, తదితరులు



యర్రగొండపాలెం నుంచి మార్కాపురం తరలుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు


ఒంగోలులో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

రైతు నేస్తాలై.. పోరు సింహాలై!

ఆర్థికంగా చితికిపోయి విలవిల్లాడుతున్న రైతన్నకు అండగా నిలిచేందుకు ఎరువుల కొరత, పంటలకు మద్దతు ధర కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం అసమర్థ పాలన, వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరుకు అడుగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ప్రభుత్వ పెద్దల సూచనలతో ఎన్ని ఆంక్షలు పెట్టినా..ర్యాలీలకు అడ్డంగా బ్యారికేడ్లు పెట్టినా.. కర్షకులతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కదంతొక్కారు. కూటమి ప్రభుత్వంపై రణభేరి మోగించారు. అర్ధరాత్రి నుంచే నోటీసులతో పోలీసులు హడావుడి సృష్టించినా మంగళవారం ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ కేంద్రాల్లో పోరుబాట చేపట్టారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

- జిల్లా వ్యాప్తంగా కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- 'అన్నదాత పోరు'కు అడుగడుగునా పోలీసుల అడ్డంకులు
- సోమవారం అర్ధరాత్రి నుంచే వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులకు ముందస్తు నోటీసులు
- పోరుబాట అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుటిల పన్నాగాలు
- ఒంగోలు, మార్కాపురం, కనిగిరిల్లో రైతులు, ప్రజలతో కలసి భారీ ర్యాలీలు
- అన్ని చోట్లా ర్యాలీలకు అడ్డంగా బారికేడ్లు

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

పోలీసులను అడ్డంపెట్టుకొని ప్రభుత్వం బెదిరింపులకు దిగినా ఎక్కడా తగ్గకుండా, సర్కారు కళ్లుతెరిపించేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు రైతులతో కలసి జిల్లా వ్యాప్తంగా 'అన్నదాత పోరు' నిర్వహించాయి. జిల్లా కేంద్రం ఒంగోలుతో పాటు మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లలో జిల్లాలోని



ఒంగోలులో రైతుల నిరసనకు హాజరైన మహిళలు


ఒంగోలులో రైతులు, కార్యకర్తలను రానీయకుండా బారికేడ్లతో అడ్డుకుంటున్న పోలీసులు


మార్కాపురంలో ఆర్డీఓ కార్యాలయం బయట భారీగా చేరుకున్న రైతులు, కార్యకర్తలు

ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని హోరెత్తించారు. అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ రైతు పోరు కార్యక్రమానికి పోలీసులు జిల్లా వ్యాప్తంగా అడుగడుగునా ఆంక్షలు పెట్టారు. జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలులో ఉందంటూ అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత ఎస్సైలందరూ వాట్సప్‌లలో మెసేజులు పెట్టారు. ఊరేగింపులు, ధర్నాలు, ప్రదర్శనలకు అనుమతులు లేవని పేర్కొన్నారు. తెల్లవారగానే పోలీసులు ముఖ్య నాయకుల ఇళ్ల వద్దకు వచ్చి రైతు పోరు కార్యక్రమాల్లో పాల్గొనవద్దని నోటీసులు ఇచ్చారు. ముఖ్యమైన కూడళ్లు, ఊరి బయట, రహదారుల వద్ద పోలీసులు నిఘా పెట్టారు.

మూడు విడతలుగా పోలీసుల అడ్డంకులు:

ఒంగోలు నగరంలో అన్నదాత పోరు కార్యక్రమానికి పోలీసులు మూడు విడతలుగా అడ్డంకులు సృష్టించారు. అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అంబేడ్కర్ భవన్ రోడ్డులోనే రైతులను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి పరిమితిగా వెళ్లాలంటూ ఆంక్షలు పెట్టారు. వందలాది మందిగా వచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడా పోలీసుల విధులను ఆటకం కలిగించకుండా పూర్తిగా సహకరించారు. అయినా మధ్యలో ఒకసారి, ఆర్‌డీఓ కార్యాలయం ముందు కూడా పరిమిత సంఖ్యలో వచ్చిన వారిని కూడా లోనికి పోనీయకుండా పోలీసులు అడ్డుకోవటంతో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

కనిగిరిలో ఆరంభంలోనే కట్టడి..

కనిగిరి డివిజన్ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్ ఇంటి మలుపు వద్ద నుంచి బయటకు వచ్చి రైతులు, ప్రజలతో కలసి రోడ్డుఎక్కగానే సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సైలు అడ్డుకున్నారు. ఇంత మందికి అనుమతి లేదని నిలిపారు. శాంతియుతంగా బస్టాండ్ వరకు ర్యాలీగా వస్తామని.. ఆ తర్వాత మీ నిబంధనల ప్రకారమే మీరు అనుమతిచ్చిన వారినే ఆర్డీఓ కార్యాలయంలోకి పంపుతామని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. దాన్ని కూడా పోలీసులు సమ్మతించలేదు. 30 యాక్ట్ అమలులో ఉందని సీఐ చెప్పడంతో.. శాంతి యుతంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్చి సెంటర్ వరకు వస్తామని పార్టీ నేతలు చెప్పారు. కొద్ది సేపు నేతలకు, పోలీసులకు వాదన జరిగింది. అనంతరం అక్కడే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి రైతులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ తర్వాత చర్చి సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లేందుకు అంగీకారం తెలిపారు. చర్చి సెంటర్ నుంచి కేవలం అనుమతి పొందిన పేర్ల జాబితాలో ఉన్న ప్రజా ప్రతినిధులను, రైతులను, నాయకులను, మాత్రమే ఆర్డీఓ ఆఫీసులోకి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. అనంతరం వారు ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు.


'అన్నదాత పోరు' లో భాగంగా మద్దిపాడులో బైక్‌పై వెళ్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



కనిగిరిలో ర్యాలీగా వస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, దద్దాల నారాయణ

అడుగడుగునా ఆంక్షలు

మార్కాపురం పట్టణంలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. వైఎస్సార్ సీపీ అన్నదాత పోరు కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించారు. అయినా మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోల ద్వారా నాయకులు, రైతులు, ప్రజలు, కార్యకర్తలు మార్కాపురం పట్టణానికి తరలివచ్చారు. పోలీసు ఆంక్షలను కూడా లెక్కచేయకుండా రైతులు కార్యకర్తలు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రైతు బాగుంటేనే అందరమూ బాగుంటాము. మీరు కూడా రైతు బిడ్డలే అంటూ పోలీసులకు నచ్చచెప్పి రైతు పోరు కార్యక్రమానికి వచ్చారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరూ ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి ఐదుగురిని మాత్రమే సబ్‌కలెక్టర్ కార్యాలయం లోకి వెళ్లేందుకు అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. వారి సూచనలు పాటిస్తూ యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తమ అనుచరులతో వచ్చారు. పాత బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి, కోర్టుసెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, అన్నా రాంబాబు పూల మాలలువేసి నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు తాటిపర్తి చంద్రశేఖర్, అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి ఇతర నాయకులు వినతిపత్రం అందచేశారు. రైతుల సమస్యలను వారు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.

బాబు పాలనలో రైతుల అగచాట్లు..



ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, దద్దాల నారాయణ, కే ఆదెన్న, బన్నీ, తిరుపతిరెడ్డి తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ రైతుకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వైఎస్సార్ పాలనలో, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రైతులను రాజుగా చూశారని.. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో రైతులకు కనీసం ఎరువులు అందించకుండా నానా అగచాట్లు పెడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతన్నకు అండగా నిలిచేందుకు చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం మంగళవారం కనిగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులు కష్టాల్లో కూరుకుపోయారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల లేదని, బీమా లేదు, పంట నష్ట పరిహారం లేదు, ఎరువులు, కాంప్లెక్స్, యూరియా కొరత ఇలా అనేక ఇక్కట్లకు గురవుతున్నట్లు వెల్లడించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో అయినా.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అయినా రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. రైతుల కోసం అండగా నిలిచింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాటం సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో గతేడాది 40 లక్షల మెట్రిక్ టన్నులు, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయని తెలిపారు. కానీ ఏ ఈడాది 7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు తగ్గించారన్నారు. రాష్ట్రంలో యూరియా, ఎరువుల కొరత ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ ఏడాది 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉందని తెలిసి కూడా.. రాష్ట్ర ప్రభుత్వం యూరియా, డీఏపీ బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో విఫలమైందన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులను, డీఏపీలను సంవృద్ధిగా తెప్పించి ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.

కూటమి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం: దద్దాల నారాయణయాదవ్

వైఎస్సార్ హయంలో, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. కూటమి సర్కార్‌లో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు కనీస గిట్టుబాటు ధరలు లేవని, రైతు భరోసా పథకాన్ని అరకొరకగా అందించి రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు ఎరువుల కోసం పడి గాపులు కాస్తుంటే.. వ్యవసాయ శాఖ మంత్రి బఫే సిస్టమ్ లాగా వచ్చారంటూ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. రైతులకు అన్ని రకాల ఎరువులను సంవృద్ధిగా అందించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర పాలనలోనే రాష్ట్ర ప్రజలు కూటమి సర్కార్ పై తీవ్రంగా మండిపడుతున్నట్లు వెల్లడించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతుందని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చేందుకు రైతులు, రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతి పత్రం అందజేశారు. తొలుత స్థానిక మున్సిపల్ చైర్మన్ గఫార్ ఇంటి వద్ద నుంచి, పామూరు బస్టాండ్ వరకు రైతులు, నాయకులు ర్యాలీగా వచ్చారు. అక్కడి నుంచి, పార్టీ నేతలు, రైతులు, రైతు నాయకులు, ప్రతినిధులు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకుడు కసుకుర్తి ఆదెన్న, పీడీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, గంగసాని లక్ష్మి హుస్సేన్‌రెడ్డి, గాయం సావిత్రి, పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, తమ్మినేని సుజాతరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పోలక సిద్దారెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, గంగసాని హుస్సేన్ రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, గయాజ్, దుర్గారెడ్డి, జీ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కటికల వెంకట రత్నం, జీ ఆదినారాయణరెడ్డి, మేడికొండ జయంతి, ఓమోగా రామిరెడ్డిలు ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు చప్పిడి సుబ్బయ్య, నుసుం వెంకటరెడ్డి, టీ రత్నరాజు, పార్టీ నాయకులు జీ బొర్రారెడ్డి, యక్కంటి శ్రీను, గజ్జల వెంకటరెడ్డి, ఓకే రెడ్డి, పాలగొల్లు మల్లి కార్జునరెడ్డి, పోలు జయరాం రెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మితికల గురవయ్య యాదవ్, భువనగిరి వెంకటయ్య, పొల్ల సుబ్రహ్మణ్యం, తాతపుడి సురేష్, నానీ, దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాచపుడి మాణిక్యరావు, సిరుప వెంకట గోవర్దన్‌రెడ్డి, సుంకర సునీత బ్రమరాంరెడ్డి, కే కృష్ణా, చింత శ్రీనివాసులరెడ్డి, వీ వెంకటరెడ్డి తూము వెంకట రెడ్డి, సుబ్బయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్నీ కష్టాలే

- చంద్రబాబు రైతు వ్యతిరేకి
- బాబు హయాంలో రైతు ఆత్మహత్యలు
- మార్కాపురంలో ఎమ్మెల్యే తాటిపర్తి, ఇన్‌చార్జిలు అన్నా, కేపీ


మార్కాపురంలో సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం/మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలే అని, దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు.

రైతు వ్యతిరేకి చంద్రబాబు: ఎమ్మెల్యే చంద్రశేఖర్

చంద్రబాబు రైతు వ్యతిరేకి అని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేవని విమర్శించారు. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మొక్కజొన్న, వరి వేస్తున్నారని, దీంతో యూరియా, ఇతర ఎరువులు అవసరమవుతున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇలాంటి ఎరువులన్నీ బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎరువులను 50 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అందుబాటులోనికి తెచ్చారని ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, రైతులకు గ్రామాల్లోనే లభించాయని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎరువులు పక్కదారి పట్టాయని అన్నారు. దీంతో రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కారని చెప్పారు. అధికారంలోకి రాగానే వెలుగొండ పూర్తిచేస్తామని చెప్పి 15 నెలలు గడిచినా రూ.100 కోట్లు కూడా ఖర్చుపెట్టలేదన్నారు. వెలుగొండ పూర్తయితేనే కరువు పోతుందన్నారు. మార్కాపురం, యర్రగొండపాలెం టీడీపీ నాయకులు మట్టి, ఇసుక, మైనింగ్ దేనినీ వదిలిపెట్టడంలేదని విమర్శించారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ: అన్నా రాంబాబు

వైఎస్సార్ సీపీ రైతులకు అండగా ఉంటుందని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతకు అండగా అన్నీ ఉన్నాయని, గిట్టుబాటు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం పంటలబీమా ఇలాంటి పథకాలన్నీ ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతును కంటికి రెప్పలా చూసుకున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు భరించలేని కష్టాలు వచ్చాయని అన్నారు. యూరియా బ్లాక్‌మార్కెట్‌కు వెళ్లిపోవడంతో పంటలకు ఎరువు దొరకదన్న ఆందోళన రైతుల్లో నెలకొందని అన్నారు.

రైతుల పథకాలు నిర్వీర్యం: కేపీ నాగార్జునరెడ్డి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా ఉండి అనేక సంక్షేమ పథకాలు ఇచ్చారని అన్నారు. ఏటా రైతు భరోసా, సున్నావడ్డీకే రుణాలు, పైసా ఖర్చులేకుండా పంటల బీమా అమలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్‌ఎస్‌కేలను నిర్వీర్యం చేసిందని, ఏడాదికి రైతు భరోసా రూ.20 వేలు ఇస్తానని చెప్పి మొదటి ఏడాది ఇవ్వలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతు సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు వెన్న హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి ప్రభుత్వ ప్లీడర్‌గా శివరామకృష్ణ

ఒంగోలు: ఇన్‌చార్జి ప్రభుత్వ ప్లీడర్‌గా బీవీ శివరామకృష్ణను నియమిస్తూ కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ప్లీడర్‌గా డి.శ్రీనివాసమూర్తి వ్యవహరిస్తున్నారు. ఆయన వద్ద నుంచి బాధ్యతలు చేపట్టాలని బీవీ శివరామకృష్ణను ఆదేశించారు. శివరామకృష్ణ ప్రస్తుతం సహాయ ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితునికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మొబైల్ మేజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాది నంబూరి సుబ్బారావు వద్ద టంగుటూరు మండలం కందులూరు వాసి జి.ఏడుకొండలు రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. కొంతకాలం తరువాత కొంత మేర బకాయి తీర్చేందుకుగాను ఫిర్యాదికి రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఫిర్యాది చెక్కును బ్యాంకులో దాఖలు చేయగా బౌన్స్ అయింది. ఈ మేరకు ఫిర్యాది కోర్టును ఆశ్రయించగా ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి నిందితునిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ నిందితునికి ఏడాది జైలుశిక్ష, రూ.7.60 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. అందులో రూ.7.50 లక్షలు నష్టపరిహారం కింద ఫిర్యాదికి చెల్లించాలని, మిగిలిన రూ.10 వేలు జరిమానా కింద ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు.

బైక్ నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

- పొలంలో ఉన్న భర్తకు ఆహారం తీసుకెళ్తుండగా గుండెపోటు..



నాగమ్మకు చికిత్స చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: పొలంలో వ్యవసాయ పని చేస్తున్న భర్త ఆకలి తీర్చేందుకు రొట్టెలు తీసుకెళ్తున్న వృద్ధురాలు మార్గమధ్యంలో గుండెపోటుకు గురై బైక్ నుంచి జారిపడి మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఐనముక్కలకు చెందిన దర్శనం కాశయ్య, నాగమ్మ(59) భార్యాభర్తలు. బలిజేపల్లి గూడేనికి సమీపంలో ఉన్న సొంత వ్యవసాయ భూమిలో పనిచేస్తున్న భర్తకు రొట్టెలు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరిన నాగమ్మ అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని యడవల్లి సమీపంలో వదిలిపెట్టాలని కోరింది. ఈ క్రమంలో ఐనముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి తీవ్రమైన గుండెపోటు రావటంతో నాగమ్మ కిందపడిపోయింది. దీంతో ఆమె కుమారుడు, బైక్‌పై వెళ్తున్న యువకుడు ఇద్దరూ కలిసి ఓ ఆటోలో నాగమ్మను దోర్నాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేస్తుండగా ఆమె మృతి చెందింది. గుండెపోటు వల్లే నాగమ్మ బైక్‌పై నుంచి జారి పడినట్లు పోలీసులకు తెలియజేయడంతో కేసు నమోదు చేయలేదు.

రైతులు బాగుపడాలంటే కూటమి గద్దె దిగాలి

- అన్నదాతలను అన్నివిధాలా వేధిస్తున్న కూటమి ప్రభుత్వం పాలించే అర్హత కోల్పోయింది
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ధ్వజం
- ఒంగోలులో వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు'కు అడుగడుగునా పోలీసుల అడ్డంకులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఒక్క రోజు కూడా అధికారంలో ఉండే అర్హత కోల్పోయిందని వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆక్రందనలు ఈ ప్రభుత్వానికి వినపడటం లేదా.. కనపడడం లేదా.. లేదంటే నిద్ర నటిస్తోందా అని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రం ఒంగోలులో మంగళవారం రైతులకు అండగా అన్నదాత పోరు కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రం ఒంగోలులో పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వందలాదిగా రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పరిపాలనలో తీవ్రంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. రాష్ట్రంలో 40 శాతానికి పైగా ఎరువుల కొరత ఉన్నట్లు స్పష్టమవుతున్నా చంద్రబాబు ప్రభుత్వం నిద్ర నటిస్తోందని ధ్వజమెత్తారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా యూరియాతోపాటు ఇతర ఎరువుల కొరతను నివారించాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలన్నారు. రైతు పండించే ప్రతి పంటకు మద్దతు ధర కల్పించాలని, ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించాలని, ఉచిత పంటల బీమాను ఏర్పాటు చేయాలని, అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇస్తానంటే తీగల మీద బట్టలు ఆరేసుకోవాలన్న చంద్రబాబుకు రైతులంటేనే ఏహ్య భావం ఉందన్నారు. రైతు కన్నీరు పెడితే ఆ ఉసురు పాలకులకు తగలకపోదని బత్తుల ఆక్షేపించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కావాలని అడిగితే 40 మంది రైతులను 45 రోజుల పాటు జైలులో పెట్టించిన ఘనుడు చంద్రబాబును అని నిప్పులు చెరిగారు.

ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవికుమార్ మాట్లాడుతూ.. యూరియా కావాలంటే డీలర్లు కాంప్లెక్స్ ఎరువులు కొనుక్కోవాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సబబన్నారు. వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న యువత మొత్తం చంద్రబాబు సీఎం అయ్యాక వెనకడుగు వేసే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుత పరిణామాలతో గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొందన్నారు.



ఒంగోలులో అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న ఆదిమూలపు సురేష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవి తదితరులు

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ మాట్లాడుతూ.. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను సీఎం చంద్రబాబు ఆత్మహత్యలప్రదేశ్‌గా మారుస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం ఎప్పటికీ రైతు వ్యతిరేకమేనని మరోసారి రుజువు చేశారని దుయ్యబట్టారు.

తొలుత జాతీయ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, అనంతరం చర్చి సెంటర్‌లోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్నకు రైతు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మారెళ్ల బంగారు బాబు, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ఆళ్ల రవీంద్రా రెడ్డి, పాలడగు రాజీవ్, మన్నె శ్రీనివాసులు, లంకపోతు అంజిరెడ్డి, మలిశెట్టి దేవేంద్ర, దానం కరుణాకర్, మీరా వలి, వేమా శ్రీనివాస రావు, భూమిరెడ్డి రమణమ్మ, యనమల మాధవి, ప్రమీల, ప్రసన్న, రమణమ్మ, మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసరావు, బచ్చల కోటేశ్వర రావు, చింతపల్లి ఫణీంద్ర, ఇనకొల్లు సుబ్బారెడ్డి, దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు విద్య తప్పనిసరి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: చిన్నపిల్లలకు చదువు తప్పనిసరి అని, బాలబాలికలు ఏదో ఒక విద్యా సంస్థలో చదవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో లీగల్ సర్వీస్ టు చిల్డ్రన్ అంశంపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ప్రభుత్వ విభాగం తమ పరిధిలో బాల్య వివాహాల నిర్మూలనకు, విద్యార్థులకు సరైన వైద్య సదుపాయాలు అందించేందుకు, మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు యతి ్నంచాలన్నారు. మెరుగైన బాల సమాజానికి సహకరించాలని బాలుర కోసం సేవలు అందించే స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు లక్ష్మానాయక్, కార్మిక శాఖ అధికారులు ఎలిజబెత్, పవన్‌కుమార్, వైద్య శాఖ అధికారులు డాక్టర్ భగీరథి, సీడబ్ల్యూసీ చైర్మన్ రామాంజనేయులు, ఇతర జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కట్టా శ్రీనివాసరావు, వాసాని అంకబాబు, పీర్‌బాషా పాల్గొన్నారు.

ప్రయాణికులకు 'అనంత' అగచాట్లు



పొదిలిలో బస్సు ఎక్కేందుకు మహిళల అగచాట్లు

- జిల్లా నుంచి 250 'ఉచిత బస్సు'లు అనంతపురం సభకు..
- మూడు రోజులకు కానీ తిరిగి రాని బస్సులు
- జిల్లాకు రూ.5 కోట్ల నష్టం
- బస్సుల కొరతతో ప్రయాణికుల ఇక్కట్లు

ఒంగోలు టౌన్/పొదిలి: రాష్ట్ర ప్రభుత్వం అనంతపురంలో బుధవారం నిర్వహించనున్న సూపర్ సిక్స్, సూపర్ సక్సెస్ సభకు జిల్లా నుంచి 250 ఆర్టీసీ బస్సులను తరలించారు. జిల్లాలో 5 ఆర్టీసీ బస్సు డిపోలు ఉండగా మొత్తం 452 బస్సులున్నాయి. ఇందులో 315 బస్సులను స్త్రీ శక్తికి కేటాయించారు. ఒంగోలు డిపోలో 75 బస్సులకు గాను 35 హయ్యర్ బస్సులను మినహాయించి మిగిలిన మొత్తం బస్సులను అనంతపురం సభకు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలు డిపో బస్సులను అనంతపురం జిల్లాలోని కొన్ని మండలాల ప్రజలను సభకు తరలించడానికి కేటాయించినట్లు తెలుస్తోంది. మంగళవారం ఒంగోలు నుంచి బయలుదేరిన బస్సులు రాత్రికి తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాలకు చేరుకుంటాయని, బుధవారం ఉదయం జనాలను ఎక్కించుకొని సభా వేదికకు చేరుకుంటాయని, సభ అయిపోయిన తరువాత తిరిగి ప్రజలను చేరవేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ లెక్కన మూడు రోజుల పాటు బస్సులు అనంతపురం సూపర్ సిక్స్ సభ డ్యూటీలోనే ఉంటాయి. ఈ మూడు రోజులు జిల్లా ప్రజలకు చుక్కలు తప్పవని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఒంగోలు నుంచి అనంతపురం సుమారు 500 కిలోమీటర్లకు పైగానే ఉంది. రాను పోను వేయి కిలో మీటర్లు ఉంటుంది. దీనికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించదని, చివరికి ఆర్టీసీ నెత్తి మీద వేస్తుందని ఆర్టీసీ యూనియన్ నాయకులు చెబుతున్నారు. సహజంగా ఏదైనా ఫంక్షన్‌కు ఆర్టీసీ బస్సు అద్దెకు తీసుకోవాలంటే 18 గంటలకు గాను రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు రుసుము వసూలు చేస్తుందని, 320 కిలో మీటర్లకు మించి ప్రయాణించకూడదని షరతు విధిస్తుందని చెబుతున్నారు. ఆ లెక్కన చూస్తే మూడు రోజులకు కలిపి రూ.5 కోట్ల భారం ప్రజలపై పడుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎంతగా దుర్వినియోగం చేస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ అధికారులు మాత్రం జిల్లా నుంచి కేవలం 120 బస్సులు మాత్రమే అనంతపురం సభకు తరలించినట్లు చెప్పడం గమనార్హం. బస్సులు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం జిల్లాలోని ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు లేవు. వచ్చిన బస్సు ఎక్కువదామంటే మహిళలు, వృద్ధులు, పిల్లలకు వీలుపడలేదు. ప్రధానంగా ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థుల బాధలు వర్ణనాతీతం.

అక్రమ కేసుల వెనుక మంత్రి డోలా

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ధ్వజం
- సింగరాయకొండ కోర్టు ఆవరణలో బాధితులకు పరామర్శ
- అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా



సింగరాయకొండ కోర్టులో వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

ఒంగోలు టాస్క్‌ఫోర్స్:

టంగుటూరు మండలం మర్లపాడులో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని రణరంగంగా మార్చేందుకు టీడీపీ కార్యకర్త ఈదర ప్రవీణ్‌కు మద్యం తాపించి ఉసిగొల్పడమే కాకుండా వినాయక మందిరం వద్ద నానా యాగీ చేయించడం వెనుక మంత్రి డీబీవీ స్వామి హస్తం ఉందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. గొడవ సృష్టించేందుకు కారణమైన టీడీపీ కార్యకర్తను వదిలేసి కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై అక్రమంగా నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను ఆదిమూలపు సురేష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. తనతోపాటు పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మర్లపాడులో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం వద్దకు మద్యం మత్తులో వచ్చి రచ్చ చేసినా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించాయని గుర్తు చేశారు. అయితే గ్రామంలోని గణేష్ మండపం వద్ద దుస్తులు విప్పి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రవీణ్‌కు దేహశుద్ధి చేశారని చెప్పారు. ఇదే అదనుగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు బనాయించి ఐదు రోజులు అక్రమంగా నిర్బంధించి, చివరకు నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడంపై మండిపడ్డారు. తొలుత బెయిలబుల్ సెక్షన్లు పెట్టిన పోలీసులు ఎవరి మెప్పు కోసం నాన్‌బెయిలబుల్‌గా మార్చారని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉందా ప్రశ్నించారు. ఈదర ప్రవీణ్‌ను రెండోసారి ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయడం వెనుక ముమ్మాటికీ మంత్రి స్వామి హస్తం ఉందని ఆరోపించారు. టీడీపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట టంగుటూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మర్లపాడు ఘటనలో వైఎస్సార్ సీపీ నాయకులకు రిమాండ్

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 2వ తేదీన టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఐదుగురిపై పోలీసులు ఈ నెల 3న కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. వినాయక విగ్రహ కమిటీ సభ్యులైన శింగమనేని బ్రహ్మయ్య, ఈదర అమరనాథ్ చౌదరి, మరో ముగ్గురిని ఘటన జరిగిన రోజే అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం సింగరాయకొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచేందుకు ప్రయత్నించగా న్యాయమూర్తి ఆదేశాలతో మంగళవారం హాజరుపరిచారు. ఐదుగురికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుని దుర్మరణం

మద్దిపాడు: వాటర్ ట్యాంక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మద్దిపాడు మండలంలోని గుండ్లపల్లి సర్వీస్ రోడ్డులో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. దార్ల ఉదయ రాజకుమార్(30) గుండ్లాపల్లిలోని హైవే సర్వీస్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కళ్యాణి ఆక్వాకు చెందిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గుండ్లాపల్లిలో తన అక్కను కలిసేందుకు హైదరాబాద్ నుంచి మంగళవారం ఉదయం వచ్చిన రాజ్‌కుమార్ ఊహించని రీతిలో మృత్యువాతపడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న మద్దిపాడు ఎస్సై సైదులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాతా, శిశు మరణాలు నివారించాలి

- వైద్యశాఖాధికారులతో సమీక్షలో కలెక్టర్

ఒంగోలు సబర్బన్: మాతృ, శిశు మరణాలను నివారించడానికి ప్రతీ ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎండీఆర్ సమావేశంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జిల్లాలో సంభవించిన మాతృ, శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ మూడు నెలల కాలంలో ఒక బాలింత మృతి చెందినట్లు అధికారులు వివరించగా, మృతికి కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యాధికారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఉన్న వసతులు, వైద్యుల గురించి ప్రశ్నించారు. బాలింత మృతిపై వైద్యారోగ్య శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి సమగ్ర నివేదికను అందజేయాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం గర్భాశయ శస్త్ర చికిత్సలపై కలెక్టర్ సమీక్షించారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి



జక్రయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

ముండ్లమూరు(దర్శి): నీళ్ల మోటారు స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి పెద్ద జక్రయ్య(67) తన ఇంటిలో నీళ్ల మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్పందించి రక్షించేలోగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు నంబూరి జాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హనుమంతరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యూరియాను నిర్దిష్ట ధరలకు అందించాలి

- ఎరువుల ప్రైవేటు డీలర్లను ఆదేశించిన కలెక్టర్



ఎరువుల ప్రైవేటు డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ

ఒంగోలు సబర్బన్:

రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, ముఖ్యంగా యూరియాను నిర్దిష్ట ధరలకు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రైవేటు డీలర్లు కూడా నిబంధనల మేరకు పని చేస్తూ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు. జిల్లాలోని ఎరువుల డీలర్లతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎరువుల లభ్యతకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఐ.ఎఫ్.ఎం.ఎస్. సైట్‌లో నమోదు చేస్తూ ఉండాలని, ఇదే విషయాన్ని వాటి ధరలతో సహా రైతులకు తెలిసేలా షాపుల ముందు కూడా డిస్‌ప్లే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాలపై అవగాహన కల్పించండి

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు నగర కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో ప్రజలకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఐటీసీ సంస్థ వెల్-బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కాన్సెప్ట్‌తో చొరవ తీసుకోవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నిర్వహణ, సోర్స్ సెగ్రిగేషన్‌కు సంబంధించి ఐటీసీ, ఏజీఎస్ సంస్థలు ఒంగోలు నగరంతోపాటు కనిగిరి, మార్కాపురం మున్సిపాలిటీలతో ఎంఓయూ చేసుకోగా, ఈ విషయంపై మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో నగర, మున్సిపల్ కమినర్లతో, ఆయా సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.